క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఖాతాదారులతో సమావేశమైన చీఫ్ మేనేజర్ సాయిరామప్రసాద్

బాలాజీచెరువు: ఖాతాదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జేఎన్‌టీయూకే ఎస్‌బీఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్.సాయిరామప్రసాద్ అన్నారు. బ్రాంచ్ ఆవరణలో శుక్రవారం ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయ ఆదేశాల మేరకు కస్టమర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిరామప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు బాగా పెరిగాయని చెప్పారు. బ్యాంక్ సిబ్బంది నుండి కస్టమర్లకు ఏ విధమైన కాల్స్ రావని, ముఖ్యంగా ఓటీపీ ,ఈకేవైసీ వంటి వివరాలు అడగరని చెప్పారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలకు ఎస్‌బీఐ యాప్, హెల్ప్‌లైన్ వాట్సాప్ నంబర్లు అందుబాటులోకి వచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ దీప్తు, ఉద్యోగులు నాయుడు, శ్రీహరి, పద్మావతి పాల్గొన్నారు.

అరట్లకట్టలో ముగిసిన 8వ సప్తాహం



అరట్లకట్ట రామాలయంలో పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకుడు

కరప: మండలంలోని అరట్లకట్ట గ్రామంలో వేంచేసిన అభయ కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న 8వ శ్రీరామ సప్తాహమహోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి రోజున సప్తాహాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వివిధ భజన బృందాలతో వారం రోజుల పాటు రేయింబవళ్లు భక్తిపాటలతో శ్రీరామసప్తాహాన్ని నిర్వహించారు. సప్తాహం ముగింపు సందర్భంగా సోడగం సూరిబాబు, విజయవెంకటలక్ష్మి దంపతులతో ఆలయ అర్చకుడు రామాచార్యులు పూజలు చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ చింతా గంగాధర్, వైస్ చైర్మన్ అడపా నాగబాబు, సభ్యులు రెడ్డి దొరబాబు, వినుకొండ శ్రీనివాస్, మల్లిపూడి శ్రీనివాస్, చిక్కాల రామకృష్ణ, నక్కా రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

20న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె. లచ్చారావు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన మహీంద్రా ట్రాక్టర్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, మెకానిక్, హెల్పర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, కస్టమర్ రిలేషన్ షిప్ మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్ ట్రైనీ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలిసేల్స్ ఎగ్జిక్యూటివ్, ఇండో ఎంఐఎం, హోండాయ్ మోబీస్, పానాసోనిక్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. డీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరుకావచ్చన్నారు.

బీసీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

బాలాజీచెరువు: కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను శుక్రవారం సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులందరూ ఐక్యతగా ఉండి, సంఘ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రామానుజన్ శ్రీనివాస్, ప్రతినిధులు గంటి రాధాకృష్ణ, వాసంశెట్టి కామేశ్వరరావు, అద్దంకి వెంకన్నబాబు, ములంపాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాకినాడ సినిమాలు

ఆనంద్ సినిమాస్:	సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ చేంజర్
దేవీ సినిమాస్:	సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ చేంజర్
లక్ష్మి:	డాకు మహరాజ్
సత్యగౌరి:	గేమ్ చేంజర్
తిరుమల:	డాకు మహరాజ్
సీఅండ్‌సీ1:	సంక్రాంతికి వస్తున్నాం
సీఅండ్‌సీ2:	గేమ్ చేంజర్
శ్రీప్రియ:	గేమ్ చేంజర్
పద్మప్రియ:	డాకు మహరాజ్

లెటర్ ఉంటేనే డీలర్..!

- ఎమ్మెల్యేల సిఫారసుతోనే భర్తీ చేయాలని అధికారులకు హుకుం
- రేషన్ డీలర్ పోస్టులన్నీ కూటమి శ్రేణులకే..
- రేపు తూతూమంత్రంగా పరీక్ష నిర్వహణ
- గత ప్రభుత్వ ఇంటింటికీ రేషన్ విధానానికి మంగళం!
- ప్రశ్నార్థకం కానున్న ఎండీయూ వాహనదారుల భవితవ్యం



లబ్ధిదారులకు ఇంటి వద్దే రేషన్ అందిస్తున్న ఎండీయూ వాహనం (ఫైల్)

కాకినాడ సిటీ: రేషన్ దుకాణాల డీలర్ పోస్టులపై కూటమి నేతల కన్ను పడింది. ఎలాగైనా వీటిని దక్కించుకోవాలనే దుర్బుద్ధితో తెర వెనుక పైరవీలు జోరుగా సాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సిఫారసు లేఖలుంటేనే డీలర్ పోస్టు ఇవ్వాలంటూ అధికారులకు ఇప్పటికే స్పష్టమైన సంకేతాలిచ్చినట్లు తెలుస్తోంది. గతంలో రేషన్ డీలర్లు గ్రామాల్లో కీలకంగా ఉండేవారు. రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేసేవారు. గ్రామస్థాయిలో ప్రజలతో నేరుగా సంబంధాలుండటం వల్ల రాజకీయ నాయకులూ వీరిని ప్రోత్సహించేవారు. మరోవైపు కొంత మంది డీలర్లు ప్రజల పంపిణీ వ్యవస్థను పక్కదారి పట్టించేవారన్న విమర్శలు బలంగా ఉండేవి. బియ్యం, పప్పులు, పంచదార వంటి సరకులను నల్లబజారుకు తరలించేవారని ఆరోపణలూ లేకపోలేదు. రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి, విజయవంతంగా అమలు చేసింది. ఈ పథకం ద్వారా కొత్తగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. ఇదే సందర్భంలో ఏళ్ల తరబడి ఉన్న డీలర్ల వ్యవస్థనూ కొనసాగించింది. ఏ ఒక్కరికీ అన్యాయం చేయలేదు. కొంత మంది డీలర్లు మొదట్లో ఎండీయూ వాహన వ్యవస్థను వ్యతిరేకించినప్పటికీ, నాటి ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో..

అధికారంలోకి కూటమి ప్రభుత్వం రావడంతోనే గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తోంది. వలంటీర్ వ్యవస్థ, ప్రభుత్వ మద్యం దుకాణాలను ఇప్పటికే కనుమరుగు చేసింది. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కలగా మిగిల్చింది. ఎండీయూ వాహనాలను రద్దు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. ఇటీవల కూడా మరో మారు ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కాకినాడ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. సేవ కంటే ఆదాయం వచ్చే మార్గం అధికంగా ఉండడంతో కూటమి నేతల కన్ను వీటిపై పడింది. కార్యకర్తలకు రాజకీయ ఉపాధి చూపాలన్న లక్ష్యంతో పైరవీలు ముమ్మరం చేశారు.

అగమ్యగోచరంగా ఎండీయూ వాహనాలు

కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో 185 రేషన్ దుకాణాలు ఉండగా, 1.65 లక్షల రేషన్ కార్డుదారులు ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసేందుకు 76 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. నిరుద్యోగులకు జీవన భృతి కల్పించాలన్న ఉద్దేశంతో ఈ వాహనాలకు బ్యాంకు రుణాలు సైతం ఇప్పించి, నెలవారీ గౌరవ వేతనం అందజేసింది. ఇప్పుడు డీలర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు జరుగుతుండడంతో, ముందుముందు ఎండీయూ వాహనాలను కొనసాగించే పరిస్థితి ఉండబోదని ఆయా వాహనాదారులు మథనపడుతున్నారు.

> **దళారులను ఆశ్రయించవద్దు**
>
> చౌకధరల దుకాణాలకు సంబంధించి ఆదివారం జరిగే రాత పరీక్షకు ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాల ద్వారా హాల్ టికెట్లు పంపిణీ చేస్తున్నాం. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. చౌకధరల దుకాణాలకు సంబంధించి దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు, ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.
>
> – ఎస్.మల్లిబాబు, కాకినాడ ఆర్డీవో

పేరుకే రాత పరీక్ష

కాకినాడ డివిజన్ పరిధిలో 96 చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ పోస్టులను నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ పోస్టులకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై, 18 నుంచి 40 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపుల వారూ దరఖాస్తులు చేసుకునే వీలు కల్పించడంతో డివిజన్‌లో భారీగా 800 పైచిలుకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 19న రాత పరీక్ష జరగనున్న నేపథ్యంలో పేరుకే రాత పరీక్ష అంటున్నారే కానీ, వాస్తవానికి ఎప్పుడో ఈ ఖాళీలపై తమ్ముళ్లు కర్చీఫ్ వేశారని అయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. అదృష్టాన్ని పరీక్షించుకున్నా ఫలితం ఉండదని కూటమి కార్యకర్తలు ముందుగానే చెప్పేస్తున్నారు. పరీక్ష కేవలం తూతూమంత్రంగా ఉంటుందని, ఎవరు పరీక్ష రాసినా డీలర్ పోస్టు మాత్రం ఎమ్మెల్యే లెటర్ ఉన్న వారికే వస్తుందని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే డీలర్ పోస్టులన్నీ తమ పార్టీలకు చెందిన వ్యక్తులకే ఇచ్చేశారంటున్నారు. ఒకవేళ పోస్టు కావాలన్నా తాము అడిగినంత మొత్తం ఇవ్వాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారని కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాలకు చెందిన డీలర్ పోస్టుకు దరఖాస్తు చేసి పరీక్షకు హాజరు అయ్యే అభ్యర్థులు బహిరంగంగా చెబుతున్నారు.

చిరస్మరణీయుడు జ్యోతిబసు



జ్యోతిబసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించిన సీపీఎం నేత జ్యోతిబసు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతిని శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షత వహించారు. ముందుగా పార్టీ జిల్లా సీనియర్ నేత దువ్వా శేషుబాబ్జీ, నగర సీనియర్ నేత కె.సత్తిరాజు కలిసి జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్మికుల శ్రేయస్సు కోసం జ్యోతిబసు జీవితాన్ని అంకితం చేశారని వారు కొనియాడారు. భూ సంస్కరణలు అమలు చేశారని, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేశారని గుర్తుచేశారు. దేశ రాజకీయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని, ఆయన ఆశయాల బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా సభ్యుడు టేకుమూడి ఈశ్వరరావు, నాయకులు కేఎస్ శ్రీనివాస్, మలక వెంకటరమణ, కె.నాగజ్యోతి, మేడిశెట్టి వెంకటరమణ, సీహెచ్ సతీష్, ఎ.ఏడుకొండలు, సీహెచ్ అజయ్‌కుమార్, టి.రాజా, రామిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్ట హర పుష్య చతుర్థి



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: పుష్యమాస వక్రతుండ సంకష్ట హర చతుర్థి సందర్భంగా గణపతి పీఠంలో 12వ చతుర్థి మాసోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత వేళలో ఉపవాసకులు సిద్ధి, బుద్ధి సమేతంగా బాల గణపతి విగ్రహాన్ని మంగళ వాయిద్యాలతో ఊరేగించి, నగర సంకీర్తన చేపట్టారు. యాపిల్, పుష్పాలతో పాలవెల్లిని అలంకరించి, పసుపు కొమ్ములతో గణేశుని పూజించారు. పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ, స్వయంభువుకి పంచలోహాల తాపడంతో కాంస్య కవచధారణ యజ్ఞం జరిగిన సందర్భంగా కృష్ణపక్ష పౌర్ణమిలో 24 నెలల చతుర్థి మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గణపతితత్వం ప్రకృతిని ఆరాధించే ఆధ్యాత్మిక మార్గమన్నారు. యువతీ యువకులు చతుర్థి చేయడం వలన మంగళసిద్ధి కలుగుతుందన్నారు. భోగి రోజున గణపతిని అభిషేకించిన ధాన్యాన్ని భక్తులకు అందజేశారు. వాటిని మట్టిలో నాటి, అంకురించిన నారును నిత్య గరికపూజకు అందించాలని కోరారు.

ఫైనల్స్‌కు చేరిన జెడ్.భావారం, గురజనాపల్లి జట్లు

ఉత్సాహంగా సీఏకే క్రికెట్ టోర్నమెంట్



రెండో సెమీ ఫైనల్‌లో తలపడుతున్న కరప వారియర్స్, గురజనాపల్లి జట్ల క్రీడాకారులు

కరప: క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప(సీఏకే) ఆధ్వర్యంలో స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్–2025 పోటీలు తుది దశకు చేరాయి. టోర్నమెంట్‌లో శుక్రవారం సెమీ ఫైనల్స్ జరిగాయి. తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ జెడ్.భావారం, పెద్దాపురప్పాడు జట్ల మధ్య రసవత్తరంగా సాగింది. ఇందులో జెడ్.భావారం జట్టు 39 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. మరో సెమీఫైనల్‌లో కరప వారియర్స్, గురజనాపల్లి జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ఇందులో గురజనాపల్లి జట్టు 12 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లో ప్రవేశించింది. శనివారం జరిగే ఫైనల్స్‌లో జెడ్.భావారం, గురజనాపల్లి జట్లు తలపడతాయని సీఏకే సభ్యులు మేడిశెట్టి దుర్గాకిరణ్, పోలిశెట్టి సునీల్, నక్కా భీమ్ తెలిపారు.

పార్కులకు పండగ కళ



గాంధీనగర్ పార్కులో ఆటపాటలతో సందడి చేస్తున్న చిన్న పిల్లలు

సందర్శకులతో ఉద్యాన వనాల కిటకిట

బోట్‌క్లబ్: నగరంలో పలు పార్కులకు సందర్శకులు పోటెత్తుతున్నారు. సంక్రాంతి సెలవులు ఈ నెల 19 వరకూ ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి కాకినాడకు వచ్చిన ప్రజలు సేద తీరేందుకు పార్కులకు వస్తున్నారు. దీంతో నగరంలో స్థానిక బోట్ క్లబ్ పార్కు, వివేకానంద పార్క్, గాంధీ నగర్ పార్క్‌తో పాటు, వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్కులు సాయంత్రం వేళ కిటకిటలాడుతున్నాయి. సాయంత్రం తమ పిల్లలతో కలిసి పార్కులకు వచ్చిన వారితో పార్కులు బిజీబిజీగా మారాయి. చిన్నపిల్లలు ఆడుకునే ఆట వస్తువుల వద్ద మరింత సందడి నెలకొంది. పార్కులో కొంతసేపు కూర్చుందామన్నా ఎక్కడా జాగా కూడా లేకపోవడంతో సందర్శకులు నిలబడాల్సిన పరిస్థితి ఉందంటే పార్కుల పరిస్థితి ఎలా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

అధ్వానంగా పారిశుధ్యం

పండగ సందర్భంగా నగరంలో పార్కులకు వచ్చే సందర్శకులు పెరగడంతో పాటు, పారిశుధ్యం కూడా అధ్వానంగా తయారైంది. సందర్శకులు తమ వెంట తెచ్చుకున్న స్నాక్స్, మిగిలిన వ్యర్థపదార్థాలు, కవర్లు వంటివి అక్కడే పడవేస్తున్నారు. దీంతో వాటిని శుభ్రం చేసేవారు కరవయ్యారు. దీంతో పార్కుల వద్ద పలు ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది.

20 నుంచి లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్

కలెక్టర్ షణ్మోహన్ సగిలి



లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌పై పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో లెప్రసీ కేసు డిటెక్షన్, మేనరికపు వివాహాలపై జిల్లా వైద్యారోగ్య శాఖ కరపత్రం, వాల్‌పోస్టర్‌ను డీఎంహెచ్‌ఓ జె.నరసింహనాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఆర్ రమేష్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వైఎస్ చక్రధర్, డిప్యూటీ డెమో అధికారి కె.సూర్యచంద్రరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సర్వేలో ప్రతి గృహాన్ని సందర్శిస్తారని, అనుమానాస్పద మచ్చలు ఉంటే నిర్ధారణ కోసం పరీక్షిస్తారన్నారు. సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు, పరీక్షించి, కేసును నిర్ధారణ చేస్తారని వివరించారు. ఆశా, ఏఎన్‌ఎంలు యాప్‌ల ద్వారా అనుమానాస్పద కేసులను మెడికల్ ఆఫీసర్ హెల్త్ లాగిన్‌లో సమర్పిస్తారన్నారు. తద్వారా కేసును గుర్తించి, ఉచితంగా మందులు ఇస్తారన్నారు. 2027 నాటికి లెప్రసీ అనేది లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు కలెక్టర్ వివరించారు.

నేడు స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం న్యూ ఇయర్–క్లీన్ స్టార్ట్ అనే ప్రత్యేక అంశంతో జిల్లాలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ నుంచి జేసీ రాహుల్ మీనా, మున్సిపల్ కమిషనర్ భావనతో కలిసి కలెక్టర్ అన్ని మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛ కాకినాడ జిల్లా రూపొందించడానికి చర్యలను వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడం తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్తకుప్పల తొలగింపు, మురికి కాలువల ప్రక్షాళన, ప్రజా మరుగుదొడ్లు శుభ్రం చేయడం, ప్రధాన రహదారులు, కూడళ్లను శుభ్రం చేయడం ఇతర పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేయాలన్నా రు. జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డీపీవో వి.రవికుమార్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ భారతి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి



శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు తదితరులు శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 20 ఏళ్ల వయసులో విజయనగర సామ్రాజ్య సింహాసనాన్ని అధిష్టించి, రాజ్యాన్ని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లారని కొనియాడారు. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడన్నారు.

నిబంధనలకు పాతర

- బడ్జెట్ సమావేశానికి ముందు అజెండా ప్రతులను ఇవ్వని అధికారులు
- ఎంపీడీఓ తీరుపై వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఆగ్రహం
- సమావేశాన్ని బహిష్కరించిన సభ్యులు, సర్పంచ్‌లు



సమావేశాన్ని బహిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



బడ్జెట్ సమావేశం అజెండా కాపీలను ముందుగా పంపకపోవడంపై ఎంపీడీఓ సతీష్‌ను నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు



వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు నిష్క్రమించడంతో మండల పరిషత్ సమావేశపు హాలులో ఖాళీగా ఉన్న సభ్యుల కుర్చీలు



మెజార్టీ సభ్యులు లేకుండా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కాకినాడ రూరల్: రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారంలో ఉండడంతో అధికారులు ఆ నేతలకు వత్తాసు పలుకుతున్నారు. నిబంధనలకు పాతర వేసి, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా, వారితో అవమానకర రీతిలో ప్రవర్తిస్తున్నారు. గ్రామాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న వారి మాటకు విలువ ఇవ్వకుండా, తమ వెనక ఎమ్మెల్యే ఉన్నారనే ధీమాతో మొండిగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

కాకినాడ రూరల్ మండల పరిషత్ బడ్జెట్ సమావేశాన్ని అధికారులు శుక్రవారం ఉదయం ఏర్పాటు చేశారు. సమావేశం గురించి ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు ముందుగా సమాచారం తెలియజేసినప్పటికీ, సంబంధిత అంశాలపై అజెండా ప్రతులను ఇవ్వలేదు. సమావేశంలో ఏం మాట్లాడాలో తెలియని స్థితిలో సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ విషయాన్ని ఎంపీడీఓ సతీష్ దృష్టికి తీసుకువెళ్లారు. తమకు అజెండా కాపీలు అందలేదని, మరోసారి సమావేశం పెట్టాలని కోరారు. వారి మాటను పట్టించుకోని ఎంపీడీఓ.. సమావేశానికి రానున్న ఎమ్మెల్యే పంతం నానాజీకి స్వాగతం పలికేందుకు బయట వేచి ఉన్నారు. ఉదయం 10.30కు ప్రారంభం కావాల్సిన మండల బడ్జెట్ సమావేశం 12 గంటల వరకు ప్రారంభం కాలేదు. దీంతో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమకు అజెండా కాపీలు ఇవ్వకుండా చిన్నచూపు చూడడంతో పాటు, కనీసం సరైన సమాధానం లేదని సమావేశపు హాలు నుంచి బాయ్‌కాట్ చేశారు. వారు బయటకు వెళుతుండగా.. ఎమ్మెల్యే పంతం నానాజీ వారికి ఎదురయ్యారు. తమతో అగౌరవంగా ప్రవర్తించారని ఎంపీడీఓ సతీష్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, సమావేశాన్ని బహిష్కరించినట్టు ప్రకటించి నిష్క్రమించారు. మరోసారి సమావేశం నిర్వహించాలని, ముందుకు అజెండా కాపీలను పంపాలని వారు కోరారు.

'పంతం'పట్టి.. సమావేశం నిర్వహణ

మండల బడ్జెట్ సమావేశానికి గంటన్నర ఆలస్యంగా 12 గంటల సమయంలో విచ్చేసిన ఎమ్మెల్యే పంతం నానాజీకి ఎంపీటీసీ, సర్పంచ్‌లు ఎదుట పడ్డారు. అజెండా కాపీలు ఇవ్వలేదని వారు తీవ్ర నిరసన తెలిపి వెళ్లిపోయారని తెలుసుకున్నప్పటికీ, బడ్జెట్ సమావేశానికి బదులు సమీక్షా సమావేశంగా మార్చుకుని కొనసాగించారు. వివిధ శాఖల అధికారులు శాఖాపరంగా పురోగతిని వివరించగా, వాటికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారి నివేదిక సమర్పిస్తుండగా, గ్రామాలలో నేటికీ రంగుమారిన నీరు కుళాయిల ద్వారా వస్తున్నాయని, తాము మార్చి నాటికి అన్ని గ్రామాలకు నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు పనులు చేయిస్తుంటే, వాటాల కోసం వారు చూస్తున్నారని.. సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఉద్దేశించి ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా తిమ్మాపురం, నేమాం, పండూరులో ఉద్దేశపూర్వకంగా సమస్యలు తీసుకువస్తున్నారని, వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

ప్రవేశపెట్టిన బడ్జెట్

సమీక్షా సమావేశం అని తొలుత ప్రకటించిన ఎమ్మెల్యే నానాజీ తరువాత బడ్జెట్‌ను ప్రవేశపెట్టించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ 2025–26కు బడ్జెట్ అంచనాలు, 2024–25కు సవరించిన బడ్జెట్ అంచనాలు చదివించి, రూ.5,84,800తో మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ(కిట్టు), ఎంపీటీసీలు కొల్లా భాస్కర్, గుత్తుల సత్తిబాబు, కొండేటి లీలావతి, ఊబా నాగమణి, ముద్దన వెంకట్రాజు, సారా రాజేష్, సీహెచ్ లక్ష్మి, వాసంశెట్టి సత్యవేణి, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్యప్రకాశరావు, వీరన్న, శీలం నాగేశ్వరరావు తదితరులు సమావేశాన్ని బహిష్కరించిన వారిలో ఉన్నారు.

ఏడుగురు సభ్యుల సంతకాలు

బడ్జెట్ ఆమోదం పొందిందని ఎంపీడీఓ సతీష్ ప్రకటించారు. ఎంపీపీ బందిలి విరీష, సభ్యులు కేతా సూర్యచంద్ర, మామిడాడ నాగచక్రం, నందిపాటి వెంకట శ్రీనివాస్, ఓసుపల్లి రాజేశ్వరి, ఎల్లబోయిన వీరదుర్గ, నందిపాటి అనంతలక్ష్మి సంతకాలు చేసినట్టు ఆయన తెలిపారు. సమావేశం ముగిసేసరికి పండూరు ఎంపీటీసీ అనంతలక్ష్మి హాజరవ్వలేదు. కేతా సూర్యచంద్ర పని ఉండి ముందుగా సంతకం పెట్టి వెళ్లిపోయారు. వాస్తవానికి జనసేనకు ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. ఎంపీడీఓ తీరును నిరసిస్తూ వెళ్లిపోయిన వైఎస్సార్ సీపీ సభ్యులపై పట్టుబట్టి ఎమ్మెల్యే నానాజీ సమావేశం జరిపించారు. తమకు జరిగిన అవమానం విషయమై ఎంపీడీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై అధికారుల నిర్లక్ష్యాన్ని పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళుతామని వైఎస్సార్ సీపీ సభ్యులు తెలిపారు.